గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లి–కొత్తపేట సమీపంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనతో పాటు ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి మండలంలోని భక్తులే కాకుండా జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, పి.ఓ.సురేష్ కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కార్మికులకు ప్రతి నెలా రూ.3వేలు ఇస్తా

ప్రొద్దుటూరు : మున్సిపల్ పారిశుధ్య కార్మికుల వేతనాలు పెరిగే వరకు తాను ప్రతి నెలా రూ.3వేలు చెల్లిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి 82 మంది కార్మికులకు తన సొంత డబ్బు రూ.18లక్షలు కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులపై ఎప్పటికీ తనకు ప్రత్యేక ప్రేమ ఉందన్నారు. అదే తరహాలోనే ప్రస్తుతం తన మాటపై విశ్వాసం ఉంచి సమ్మె విరమించిన 43 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమ్మె చేసిన కాలానికి సంబంధించి రూ.3వేలు అందించామన్నారు. వీరికి ఫిబ్రవరి నెల నుంచి ప్రతి నెలా తాను అదనంగా రూ.3వేలు చెల్లిస్తానన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లు వేతనాలు చెల్లించడంపై కార్మికులు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, జిలాన్, కమాల్, పోరెడ్డి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బాబు పాల్గొన్నారు.



కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రొద్దుటూరు : గోపవరం పంచాయతీ పరిధిలో రెండు చోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాచమల్లు ఆదివారం భూమి పూజ చేశారు. మల్లేల గుడి సమీపంలోని కొర్రపాడు బండ్ల రస్తాలో రూ.20లక్షల అంచనాతో రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అలాగే న్యూ హౌసింగ్ బోర్డు పార్కు వద్ద రూ.6లక్షల అంచనాతో నిర్మిస్తున్న కల్వర్టు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. సర్పంచ్ మోషా, కొండన్న వైస్ ఎంపీపీ దస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ అధ్యాపకురాలికి పురస్కారం



వినోదినికి పురస్కారం అందజేస్తున్న అతిథులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు డాక్టర్ ఎం.ఎం.వినోదిని ఆదివారం ఎదిరెపల్లి మశమ్మ స్మారక అవార్డు అందుకున్నారు. నాగర్కర్నూలు జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో సమావేశ మందిరంలో ఎదిరెపల్లి మశమ్మ స్మారక పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధిపతి ఆచార్య కాశీం ముఖ్య అతిథిగా విచ్చేసి పురస్కారం, రూ.20 వేల నగదు, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఎదిరెపల్లి మశమ్మ స్మారక కమిటీ చైర్మన్ కాశన్న, ప్రతినిధులు పాల్గొన్నారు.



స్విమ్మింగ్‌తో శారీరక దృఢత్వం



డాక్టర్ మైరెడ్డి, రాజశేఖర్‌లను సన్మానిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్విమ్మింగ్ చేయడం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం చేకూరుతుందని కడప ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పెన్నానదీ తీరంలోని ఎగ్జిక్యూటివ్ హెల్త్‌క్లబ్‌లో ఆదివారం ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ స్విమ్మర్స్ పోటీల్లో మెడల్స్ సాధించిన ప్రొద్దుటూరుకు చెందిన డాక్టర్ మైరెడ్డి, రాజసింహ హోటల్ అధినేత రాజశేఖరరెడ్డిల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పతకాలు సాధించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో స్విమ్మర్‌లు రసూల్ రెడ్డి, అహ్మద్‌హుసేన్, మునికుమార్‌రెడ్డి, రామకృష్ణ, రాజ తదితరులు పాల్గొన్నారు.








ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. ఆదివారం కడపలోని టీటీడీ కల్యాణ మండపంలో ఎస్టీయూ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి, ఏపీఎస్‌ను అమలు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, ఉపాధ్యాయవాణి ప్రధాన సంపాదకులు గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ జీవో నంబర్: 117ను రద్దు చేసి, పాఠశాలల విలీన ప్రక్రియను ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంరాజు, గంటల మోహన్, బాల గంగిరెడ్డి, గురకుమార్, దాదాపీర్, పురుషోత్తం, ఇలియాస్ పాల్గొన్నారు.







మంచి పౌరులుగా ఎదగాలి

వేంపల్లె : విద్యార్థులు సమాజ సేవా పౌరులుగా ఎదగాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార్‌స్వామి గుప్తా అన్నారు. ఆదివారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల మానవాళి మనుగడకు ఎంతో ఉపయోగమన్నారు.

















వైఎస్సార్ సీపీ ప్రొద్దుటూరు మున్సిపల్ పార్టీ కమిటీ నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు మున్సిపల్ పార్టీ కమిటీని నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ అధ్యక్షుడిగా కామిశెట్టి సుబ్రమణ్యం (బాబు), ఉపాధ్యక్షులుగా ఎం.వెంకట సుబ్బారెడ్డి, ఉట్టి నాగశ్యానమ్, ప్రధాన కార్య దర్శులుగా పి.ఓబుల్‌రెడ్డి, మారుతిప్రసాద్, షేక్ ఇర్ఫాన్, కోశాధికారిగా బి.వంశీధర్‌రెడ్డి, కార్య దర్శులుగా సి.అనిల్‌కుమార్‌రెడ్డి, లక్కిరెడ్డి పవన్‌కుమార్‌రెడ్డి, సుబ్బరాయుడు, పి.బాలాజీ, జి.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.ప్రభుకుమార్, సభ్యులుగా ఎన్.నాగేంద్రారెడ్డి, కె.శివ వేమయ్య, బి.నాగరాజు, జి.మనో హర్, జి.పద్మావతిరెడ్డి, ఐ.పవన్‌కుమార్, హనీఫ్, ఎం.సంజీవకర్ణ, బి.సూర్యనారాయణ, చాంద్‌బాష, నరసింహులు, దస్తగిరి, జయశంకర్, రామాంజనేయులు నియమితులయ్యారు.

- ప్రొద్దుటూరు మండల కమిటీ అధ్యక్షులుగా ఎం.ఓబుల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా మేరి, ఎం.గోపినాథ్, ప్రధాన కార్యదర్శులుగా బి.నాగేంద్రారెడ్డి, బి.వెంకటరాముడు, బి.శేఖర్, కోశాధికారిగా యు.రామసుబ్బులు, కార్యదర్శులుగా వి.ఓబులేశు, మౌలాలి, వి.వెంకట సుబ్బారెడ్డి, వి.రంగనాయకులు, విజయకుమార్, ఎ.నాగేంద్ర, సభ్యులుగా ఎం.చైతన్యరెడ్డి, ఎల్.శంకర్‌రెడ్డి, వై.ఆనందరావు, సి.జాకీర్ హుసేన్, బి.కొండారెడ్డి, కె.ప్రతాప్‌రెడ్డి, టి.సాంబశివారెడ్డి, ఎం.పాలకొండారెడ్డి, పి.రవి, ఎ.ప్రసాద్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, విశ్వనాథరెడ్డి, డీవీ సుబ్బారెడ్డి, వి.మహేందర్‌రెడ్డి, ఎన్.రవిశంకర్ నియమితులయారు.
- రాజుపాలెం మండలం కమిటీ అధ్యక్షులుగా జి.రాజారామ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సుబ్బరాయుడు, జ్ఞానానందం, ప్రధాన కార్యదర్శులుగా డి.రంగారెడ్డి, ఎస్.శ్రీనివాస్, డి.భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా పోలా వరలక్ష్మి, కార్యదర్శులుగా కె.బలరామిరెడ్డి, వి.బుడెన్ సాబ్, ఎంవీ యోగానందరెడ్డి, పి.వెంకట రమణ, భాస్కర్‌రెడ్డి, శ్రీధర్, సభ్యులుగా ఎన్.ఖదీర్, ఎస్.నరసింహులు, ఎస్.దస్తగిరి, పుల్లయ్య, కె.దేవరాజు, నరసింహులు,సుంకులయ్య, కృష్ణయ్య, షేక్ మాబుషరీప్, శ్రీనివాస్, రవి, రామకృష్ణారెడ్డి, సి.బాలయ్య, శ్రీనివాసులు, రంగనాయకులను నియమించారు.

బద్వేలు టీడీపీలో అసమ్మతి స్వరం



సమావేశానికి హాజరైన టీడీపీ అసమ్మతి నాయకులు

అట్లూరు: బద్వేలు తెలుగుతమ్ముళ్లలో అసమ్మతి సెగలు చాపకింద నీరులా సాగిపోతున్నాయి. బద్వేలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొజ్జా రోషన్నను మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అధిష్టానాన్ని ఒప్పించడంతో వ్యతిరేక వర్గం అట్లూరు మండలంలో భవిష్యత్తు కార్యాచరణపై రహస్య సమావేశం నిర్వహించినట్లు సమాచారం. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి పాలైన ఓబులాపురం రాజశేఖర్ పార్టీని నమ్ముకుని పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉన్నారు. ఈ సారి కూడా తనకే టీడీపీ టికెట్ ఇస్తారని ఆయనతో పాటు ఆయన అభిమానులు ఆశించారు. ఈ నేపథ్యంలో బద్వేలు ఇంచార్జ్ విజయమ్మ తమ పలుకు బడిని ఉపయోగించి రాజశేఖర్‌ను పక్కన పెట్టి ప్రభుత్వ ఉద్యోగి అయిన బొజ్జా రోషన్న 2024 ఎన్నికలలో పోటీ చేస్తారని ప్రకటించారు. అంతే కాదు ఆయనను బలపరుస్తూ విజయమ్మ తనయుడు రితీష్‌కుమార్‌రెడ్డి బద్వేలు నియోజక వర్గంలో పాదయాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన పాదయాత్రకు రాజశేఖర్ వర్గం దూరంగా ఉంది. దీంతో ఆయన వర్గం ఆది నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నాయకులు విజయమ్మకు వ్యతిరేకంగా ఆదివారం అట్లూరు మండల పరిధిలోని సీనియర్ నాయకుడు మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తపు మునిరెడ్డి నివాసంలో నియోజక వర్గనాయకులు రహస్య సమావేశం నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈసమావేశంలో విజయమ్మ ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తోందని ఆమె నాయకత్వంలో కొనసాగలేమని భవిష్యత్తు కార్యచరణపై మరోమారు అసమ్మతి నాయకులతో ఈనెల 7వ తేదీన బద్వేలులో సమావేశమై నిర్ణయం తీసకోనున్నట్లు సమాచారం.

బ్రాహ్మణ సేవా సంఘం ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గంతో బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం నూతన కార్యవర్గంతో సంఘ అధ్యక్షుడు కంబగిరిరావు ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం కార్యదర్శిగా తిరుమల చంద్రశేఖర్, ఉప కార్యదర్శి కె.వెంకటరమణ, ఎస్.నరహరి శర్మ, ఉపాధ్యక్షులుగా కేఎల్ రంజన్‌శర్మ, రామవర్జుల రామసుబ్రహ్మణ్యం, రేవనూరు సత్యనారాయణ శర్మ, కైపా మధుసూదన్‌లతో పాటు పలువురు ఈసీ మెంబర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు.

కొనసాగిన సమ్మె

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల మండల రెవిన్యూ కార్యాలయం వద్ద ఆదివారం అంగన్వాడీలు 20 వ రోజు సమ్మెలో పాల్గొన్నారు. కనీస వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ అంగన్‌న్వాడి యూనియన్ నేతలు పాల్గొన్నారు.

చాపాడు: మండలంలోని అంగన్వాడీ వర్కర్లు ఆదివారం మండల కేంద్రమైన చాపాడులోని కుందూనదిలో నిరసన తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేపట్టిన అంగన్వాడీ వర్కర్లు 20వ రోజు కుందూనదిలోని వెళ్లి తమ సమస్యలను గంగమ్మ తల్లికి చెప్పుకుంటున్నామని నిరసన తెలిపారు. అంగన్వాడీ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ తమ సమస్యలను పరి ష్కారం చేయాలనే ఉద్దేశ్యంతో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.













తాగి వాహనాలు నడపొద్దు

పోరుమామిళ్ల: నూతన సంవత్సరమని అతి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు. మద్యం తాగి ఇష్టారాజ్యంగా వ్యవహరించినా, వాహనాలు వేగంగా నడిపి ప్రమాదాలకు కారణమయినా, మైనర్లు వాహనాలు నడిపినా కఠిన చర్యలు తప్పవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో కేక్ కట్ చేసి, వేడుకలు జరిపినా, చట్టాన్ని అతిక్రమించినా కేసు నమోదు చేస్తామన్నారు. కుటుంబసభ్యుల మధ్య ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని పేర్కొన్నారు.











ఆరోగ్యమే - మహాభాగ్యం

హాస్పిటల్స్ వారి నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు — స్పెషల్ ఫీచర్ 2024

3న పింఛన్ పంపిణీ

మైదుకూరు : మైదుకూరు మండలం, మున్సిపాలిటీలోని అవ్వా తాతలకు, ఇతర లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును జనవరి 3వ తేదీన పంపిణీ చేయనున్నారు. కొత్తగా మంజూరైన వారికి, పాత వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్మును రూ.2,750 నుంచి రూ.3వేలకు పెంచిన విషయం తెలిసిందే. ఈ సొమ్ము జనవరి 3వ తేదీ ఉదయం 10 గంటలకు మైదుకూరు జెడ్పీ హైస్కూల్ మైదానంలో పింఛన్ పంపిణీ సంబరం కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పంపిణీ చేయనున్నారు. ఈ విషయాన్ని గమనించాలని మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి తెలిపారు.

నేడు ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు : అభిమానుల కోరిక మేరకు నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం తన ఇంటి వద్దే ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రజలకు ముందస్తుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తన నివాసం వద్ద సోమవారం నూతన సంవత్సర వేడుకల్లో నియోజవర్గ ప్రజలు పాల్గొనాలని అల్పాహార విందును స్వీకరించాలని కోరారు.

పసిడిపురిలో సూపర్ స్పెషాలిటీ వైద్యం

- మహానగరాలకు ధీటుగా ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవలు
- అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు



ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం వరకు ఇక్కడ కొన్ని రకాల వ్యాధులకు మాత్రమే వైద్యం అందుబాటులో ఉండేది. ఇటీవల కాలంలో అన్ని రకాల జబ్బులకు పూర్తి స్థాయిలో వైద్యం లభిస్తోంది. ప్రైవేట్ వైద్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటూ మెరుగైన చికిత్సలను అందిస్తున్నారు. ఆకస్మిక అనారోగ్యం, అత్యవసర ఆరోగ్య సమస్యలకు క్రిటికల్ కేర్ ఆస్పత్రుల్లోని వైద్యులు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు. గైనకాలజీ, పీడీయాట్రిక్, న్యూరో, ఆర్థో, జనరల్ మెడిషన్, గుండె, కంటి సమస్యలు, గ్యాస్ట్రోఎంట్రాలజీ, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు ఆయా విభాగాల వైద్యులు నాణ్యమైన చికిత్స చేస్తున్నారు. గుండె జబ్బులకు సంబంధించి ఏదైనా సమస్య వస్తే కర్నూలు, హైదరాబాద్ లాంటి నగరాలకు హుటాహుటీనా వెళ్లాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు ప్రొద్దుటూరులోని పలు ఆస్పత్రుల్లో గుండెకు చికిత్స చేస్తున్నారు. అలాగే అన్ని రకాల స్త్రీ సంబంధిత వ్యాధులకు అత్యాధునిక వైద్యాన్ని అందించే ఆస్పత్రులు ప్రొద్దుటూరులో అనేకం ఉన్నాయి. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఇక్కడి నెట్ వర్క్ ఆస్పత్రుల్లో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. స్థానిక ఆస్పత్రుల్లో 24 గంటల పాటు అన్ని రకాల వ్యాధులకు, ఆరోగ్య సమస్యలకు మంచి వైద్యం అందిస్తుడటంతో ప్రొద్దుటూరుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు చికిత్స కోసం ఇక్కడికి వస్తున్నారు. వ్యాధినిర్ధారణ చేయడమే గాక తక్కువ వ్యయంతో మంచి వైద్యం అందడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

అట్లూరు : ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా ఆదివారం బద్వేలు మండలంలోని మడకలవారిపల్లె, లక్ష్మీపాలెం గ్రామాల్లో త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంతో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో హిందూ జ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ అధ్యక్షుడు జి.ప్రసాద్, సభ్యులు జి.సుధాకర్, జి.పెంచల రత్నం, కె.నరసింహులు, షేక్‌సలీం, బి.భువనేశ్వర్‌రెడ్డి, వై.మహేంద్ర, డి.రమణమ్మ, కె.వెంకటసుబ్బమ్మ, ఎస్.రత్తమ్మ, జి.అక్షయ, జి.మధుప్రియ పాల్గొన్నారు.



త్రైత భగవద్గీత గ్రంథంతో సమితి సభ్యులు

అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న గంగా సురేష్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాష్ట్రంలోని ఇంటర్, డిగ్రీ కళాశాలల్లోని ఖాళీ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంగా సురేష్ పేర్కొన్నారు ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేసినప్పటికీ, అనేక ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, నగర అధ్యక్షుడు శివ నాగేంద్ర, ఉపాధ్యక్షుడు నాగార్జున, చైతన్య, సహాయ కార్యదర్శి రాజ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ 'మైదుకూరు' కమిటీ నియామకం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బ్రహ్మంగారి మఠం మండల కమిటీని నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ అధ్యక్షులుగా రత్నకుమార్ యాదవ్, ఉపాధ్యక్షులుగా వి.నరసింహారెడ్డి, బి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా సిద్దారెడ్డి, స్వామిదాస్, కె.నరసింహులు, కోశాధికారిగా టి.నాగార్జుననాయుడు, కార్యదర్శులుగా బి.గుర్రప్ప యాదవ్, జె.చిన్నా, ఎ.లక్ష్మయ్య, ఆర్.చిన్నమస్తాన్, ఎం.సుబ్బరాయుడు, సిద్దారెడ్డి, సభ్యులుగా ఎ.నాగిరెడ్డి, పెద్దిరెడ్డి, పుల్లయ్య, బి.చెన్నకృష్ణారెడ్డి, పి.ఓబుల్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, ఆర్.అమీర్‌బాష, అనంతరెడ్డి, మనోహరాచారి, ఆర్.లక్ష్మిదేవి, బసిరెడ్డి, శివారెడ్డి, మేకల జయరాం, దుగ్గిరెడ్డి, బాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు.

- చాపాడు మండల కమిటీ అధ్యక్షులుగా చాపాటి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.రమణయ్య, పుల్లయ్య, ప్రధాన కార్యదర్శులుగా జైనుల్లా, జయరాజు, రామచంద్రారెడ్డి, కోశాధికారిగా వై.రామాంజనేయరెడ్డి, కార్యదర్శులుగా బి.భాస్కర్‌రెడ్డి, టి.రామసుబ్బారెడ్డి, ఎల్.నాగేశ్వర్‌రెడ్డి, పి.చంద్రయ్య, ఎల్.సుమలత, సభ్యులుగా పి.చెన్నయ్య, ఎ.ఓబులేశు, టి.శ్రీనివాసులు, కె.చెన్నారెడ్డి, పి.విశ్వనాథ, ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, వి.నాగరాజు, జి.వెంకట రమణ, సి.జమాల్‌వలీ, జి.చంద్ర, సి.చంద్ర మహేశ్వర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రాజశేఖర్, బి.మోహన్‌రెడ్డి, టి.లక్ష్మణ్‌లు నియమితులయ్యారు.
- దువ్వూరు మండల కమిటీ అధ్యక్షులుగా ఎస్‌సీ మహబూబ్‌బాష, ఉపాధ్యక్షులుగా ఎల్.వీరశేఖర్‌రెడ్డి, ఎస్.ఓబులేశు, ప్రధాన కార్యదర్శులుగా ఆర్.చంద్ర ఓబుల్‌రెడ్డి, పి.మహబూబ్‌అలీ, నారా యాసోబ్, ట్రెజరర్‌గా సీవీవీ స్వామి, కార్యదర్శులుగా మోహన్, ఆర్.రాజేష్, పి.సుధాకర్, పి.శ్రీనివాసులురెడ్డి, ఎస్.శ్రీకాంత్, ఎస్.పెద్ద సుబ్బరాయుడు, సభ్యులుగా నాగరాజు, మద్దిలేటి రెడ్డి, రామమునిరెడ్డి, బీవీ సుబ్రమణ్యం, ఆర్.పుల్లయ్య, బి.లక్ష్మిరామనాయక్, ఎన్.వెంకట సుబ్బారెడ్డి, దస్తగిరి, మహబూబ్ షరీఫ్, జె.వీరలక్ష్మిరెడ్డి, ఆశీర్వాదం, వై.రవీంద్రనాథ్‌రెడ్డి, బి.లింగేశ్వర్‌రెడ్డి, టి.కుళ్లాయమ్మ, విజయలు నియమితులయ్యారు.
- ఖాజీపేట మండల కమిటీ అధ్యక్షులుగా ఓ.మురళీమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.ముజీబుర్ రెహ్మాన్, జి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శులుగా జి.నాగేశ్వరరెడ్డి, ఎస్.సుధాకర్‌రెడ్డి, సి.విజయబాబు, కోశాధికారిగా ఎ.సంతోష్, కార్యదర్శులుగా కె.ఉదయభాస్కర్‌రెడ్డి, వి.గురివిరెడ్డి, ఎస్.రాజశేఖర్ యాదవ్, జి.రవి, సభ్యులుగా ఎం.చిన్న వెంకటన్న, లక్ష్మయ్య, సునీల్‌కుమార్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఇ.రఘు, చంద్రశేఖర్‌రెడ్డి, గంగన్న, వి.బాష, జి.వెంకట రమణ, ఎన్.సుబ్బయ్య, వై.సుభాష్, ఇ.హబీబుల్లా, ఎస్.చంద్ర, మనోజ్, ప్రవీణ్, డేవిడ్‌లు నియమితులయ్యారు.
- మైదుకూరు మున్సిపాలిటీ పార్టీ కమిటీ అధ్యక్షులుగా కె.లింగన్న, ఉపాధ్యక్షులుగా నాయబ్ రసూల్, రాందాస్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.ఖాదర్‌బాష, ఎస్.శ్రీనురావు, ఏసీఆర్‌వీ రమణ, కోశాధికారిగా బీఎల్ రఘురామయ్య, కార్యదర్శులుగా ట్రాక్టర్‌గౌస్, జీటీ శ్రీధర్, కె.మధుసూదన్‌రెడ్డి. కె.రమణమూర్తి,ఎస్ఎం జాఫర్, ఎస్.సురేష్‌లు,సభ్యులుగా వెంకట సుబ్బారావు, డి.గౌస్, వీరభద్రుడు, చొక్కం శివ, పి.చంద్ర ఓబుల్‌రెడ్డి, పి.నాగయ్య, జి.రామచంద్ర, బి.శ్రీనివాసులు, ఏసీఆర్ చంద్ర యాదవ్, వై.గౌస్, దస్తగిరి, బీఎస్ రామకృష్ణ, బి.సుబ్బరాయుడు, బ్రహ్మయ్య, కె.పుల్లయ్య నియమితులయ్యారు.
- మైదుకూరు రూరల్ పార్టీ కమిటీ అధ్యక్షులుగా జి.నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.కాలేషా, ఎస్.జపన్య, ప్రధాన కార్యదర్శులుగా కె.సంజీవరెడ్డి. ఎ.నాగరాజు, పి.రియాజ్‌ఖాన్, కోశాధికారిగా ఎం.సుబ్బారెడ్డి, కార్యదర్శులుగా నాగేశ్వరరావు, సురేష్, వెంకట సుబ్బారెడ్డి, బి.మల్లికార్జున, ఎస్.అన్వర్‌బాష, శ్రీను, సభ్యులుగా వీరయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, సయ్యద్‌బాష, ఎం.సుబ్బారెడ్డి, కె.ఆంజనేయులు, పి.దశరథరామిరెడ్డి, పి.రామసుబ్బారెడ్డి, చిన్నవీరభద్రుడు, ప్రసాద్‌రెడ్డి, సుధాకర్, ఎ.షామీర్‌హుసేన్, మహేశ్వర్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, ప్రతాప్, రామయ్య నాయక్‌లు నియమితులయ్యారు.

చారిత్రక నవలా రచనలో మేటి

– అజీజ్ రచించిన 'టిప్పు సుల్తాన్' పుస్తకావిష్కరణ


పవన్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్ : చారిత్రక నవలా రచనలో అజీజ్ మేటిగా నిలుస్తున్నారని యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధక విద్యార్థి ఎం.పవన్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 127వ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయిత అజీజ్ జీవిత విశేషాలను వివరించారు. అధ్యాపకులు ప్రసాద్ బాబు అజీజ్‌ను రచయితగా ప్రోత్సహించారని తెలిపారు. చరిత్ర విద్యార్థి కాబట్టి వెలుగులోకి రాని నిజాల్ని, పోరాటాల్ని బయటకు తేవాలన్న తపన ఉన్నట్టు అతని రచనల వల్ల తెలుస్తుందన్నారు. పలు ప్రముఖ వారపత్రికల్లో చారిత్రక అంశాలను చారిత్రక సత్యాలు శీర్షికన సీరియల్స్‌గా రాశారన్నారు. ఇవేకాకుండా పలు నాటికలు, కథలు, డిటెక్టివ్ కథలు కూడా రాశారని వివరించారు. వాటిలో ప్రాచుర్యం పొందిన నవలల గురించి తెలిపారు. గులాం రసూల్ ఖాన్, తుర్రెబాజ్ ఖాన్, తడి గౌతమ బుద్ధుడు, రాబిన్‌సన్ క్రూసో, మనిషి, బుడ్డా వెంగళరెడ్డి, గెలివర్ సాహసయాత్రలు, భారతదేశంలో స్త్రీ వంటివి ప్రాచుర్యం పొందాయన్నారు. రచయిత అజీజ్ తన స్పందనను తెలుపుతూ ×తన జీవిత సాహిత్యాలపై₹ నెల నెలా సీమ సాహిత్యంలో చోటు కలిపించినందుకు విశ్వవిద్యాలయ అధికారులకు, బ్రౌన్ సంచాలకులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో అజీజ్ రచించిన 'టిప్పు సుల్తాన్' అనే పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అజీజ్, పవన్‌కుమార్‌రెడ్డిలను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పేట రామప్రసాదరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎస్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక కలసి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. ఐ

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

బద్వేలు అర్బన్ : ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 డైరీ, క్యాలెండర్‌లను ఆదివారం స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయం ఆవరణలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. విద్యారంగ పరిరక్షణ కోసం రాబోవు రోజుల్లో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఓబుల్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానందం, సుధాకర్, ట్రెజరర్ గురయ్య, గౌరవాధ్యక్షులు సుబ్బరాజ, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శివప్రసాద్, జిల్లా కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసులరెడ్డి, చెన్నయ్య, పి.వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల క్యాలెండర్ల ఆవిష్కరణ

పోరుమామిళ్ల: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్), ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్ 257) సంఘాల 2024 నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆవిష్కరించారు. ఆ యా ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం


ఎస్‌ఎఫ్‌ఐ జెండా ఆవిష్కరించిన రవి

పోరుమామిళ్ల: భారత విద్యార్థి ఫెడరేషన్ 54 వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం పట్టణంలోని గురుకుల పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ జెండాను ఆ సంస్థ జిల్లా ఉపాధ్యక్షులు వీరపోగు రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. విద్యను ప్రైవేటీకరణ చేయడాన్ని, మూఢనమ్మకాలకు, అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగం బలోపేతం కావాలని, పేద విద్యార్థులకు విద్య దూరం కాకూడదని ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్, విజయభాస్కర్, అశోక్, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య అక్షింతల పంపిణీ

కడప కల్చరల్: 1వ నుంచి 15 వ తేదీ వరకు దేశవ్యాప్తంగా దాదాపు 20 కోట్ల కుటుంబాలకు అయోధ్య పూజిత అక్షింతల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ప్రతి ఇంటికి అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర ధర్మా చార్య సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామమహేష్ ఆదివారం విలేకరులకు తెలిపారు. వీహెచ్‌పీ కడప నగర అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే కడప జిల్లాలో అన్ని దేవాలయాలు, గ్రామాలకు పవిత్ర అక్షింతలు, ఆహ్వాన పత్రాలను విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు అందజేస్తున్నారన్నారు.

ఘనంగా అయోధ్య రామమందిర అక్షింతల గ్రామోత్సవం


ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, బీజేపీ, రామభక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : అయోధ్య నుంచి తెచ్చిన శ్రీరాముని అక్షింతలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రామనామస్మరణ మధ్య అట్టహాసంగా ఊరేగించారు. స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన ఈ గ్రామోత్సవం వసంతపేట, గాంధీరోడ్డు, టీబీరోడ్డు, రాజీవ్ సర్కిల్, శివాలయం సర్కిల్ వరకు నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో కాషాయ జెండాలను వాహనాలకు కట్టుకుని ఈ వేడుకలో పాల్గొన్నారు. సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలను, అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ప్రత్యేకంగా రథంపై ఉంచి గ్రామోత్సవాన్ని అట్టహాసంగా జరిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు, భక్తులు, పలు ఆలయాల నిర్వాహకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు సేవా కార్యక్రమాలు



ఆహార పొట్లాలు అందజేస్తున్న పాస్సిబిలిటీ మినిస్ట్రీస్ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సెవెంత్ డే అడ్వెంటిస్ట్ సెక్షన్ ఆఫీసు ఆధ్వర్యంలో పాస్సిబిలిటీ మినిస్ట్రీస్ శాఖ తరపున కడపలో ఫుట్‌పాత్‌పై ఉన్న నిరాశ్రయులు, అనాథలకు ఆహారం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ డైరెక్టర్ ప్రకాష్, సంఘ పెద్దలు పాల్గొన్నారు

సీఆర్‌ఐ సుబ్బారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో..

సీఆర్‌ఐ సుబ్బారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో కడప నగరంలోని రాజారెడ్డి వీధిలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఆర్‌ఐ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సీఆర్‌ఐ సునీల్ జయంత్, ఫ్రాంక్లిన్, సీఆర్‌ఐ దినేష్ కుమార్, పలువురు ప్రముఖులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం

కడప ఎడ్యుకేషన్ : కడప నాగార్జున మోడల్ స్కూల్‌లో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాగార్జున విద్యా సంస్థల డైరెక్టర్ భానేష్‌సాయిరెడ్డి హాజరై క్రీడా పతాకాన్ని ఎగురవేసి, ఒలింపిక్స్ క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు రకాల ఆటల పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీదేవి మాట్లాడుతూ కీడల్లో పాల్గొనడం వల్ల పిల్లలకు మానసిక వికాసంతో పాటు శారీరక దృఢత్వం వస్తుందన్నారు. క్రమశిక్షణ, సమయస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు.

ప్రశాంతంగా వేడుకలు నిర్వహించుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో డిసెంబర్ 31 రాత్రి నుంచి 2024 జనవరి ఒకటో తేదీ వరకు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ తెలిపారు. ఆదివారం తమ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన దిశా నిర్దేశం చేశారు. కడప నగరంలోని ప్రధాన కూడళ్లలో మోటారు వాహనాలతో శబ్ద కాలుష్యం చేస్తూ, బైక్ రేసులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులకు ప్రజలు స్నేహ పూర్వకంగా సహకరించాలని తాము కూడా ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తామన్నారు. కడప నగరంలోని ఏడు రోడ్ల కూడలి, వన్ టౌన్ సర్కిల్, పాత బస్టాండ్, కడప కోటిరెడ్డి సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, వై జంక్షన్, అప్సర సర్కిల్, కృష్ణా సర్కిల్, మహావీర్ సర్కిల్, రిమ్స్ సర్కిల్, ఐటిఐ సర్కిల్ నుంచి రాయచోటి రోడ్డు సర్కిల్ వరకు ఆయా పోలీస్ అధికారులతో సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. డ్రంకన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్ లాంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలను నడిపేందుకు అవకాశం ఇవ్వరాదన్నారు. ఈ సమావేశంలో కడప వన్‌టౌన్ సీఐ సి.భాస్కర్‌రెడ్డి, టూటౌన్ సీఐ తబ్ రేజ్, చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, కడప రిమ్స్ సీఐ రామచంద్ర, కడప రూరల్ సీఐ శంకర్ నాయక్, ఎస్‌ఐలు రవి కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

చలిగింతలు!

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో తగ్గిన ఉష్ణోగ్రతలు
- మిచాంగ్ తర్వాత మారిన వాతావరణం
- పెరిగిన చలిగాలులు



మంచుతో కప్పబడిన కడప-రేణిగుంట హైవే



కడప కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన చలి దుస్తుల షాపు

రాజంపేట/కడప అగ్రికల్చర్: నిన్న మొన్నటి వరకు చుర్రుమనే ఎండ.. ఉక్కబోత, శీతలం ప్రవేశించే నవంబరు నెలలో సైతం ఇదే వాతవరణం. వర్షాలు లేకపోవడం ఇందుకు కారణం. కార్తీకమాసం ఆరంభంలో శీతలం మొదలైనా పెద్దగా చలి వాతావరణం లేదు.కానీ మిచాంగ్ తుపాను తర్వాత వాతవరణం మారిపోయింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో చలిపంజా విసురుతోంది. ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. మంచు దుప్పటి ఇబ్బందులకు గురిచేస్తోంది. దీనికి తోడు రెండు, మూడు రోజులుగా ఎండలు లేకుండా మబ్బుల వాతవరణం. గాలులు వీస్తుండటంతో చలి మరింత వణికిస్తోంది. ఉషోదయం పల్లెలను మంచు దుప్పటి కప్పేస్తోంది.

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. గత నెల ఇదే సమయానికి 34 డిగ్రీల సెల్సియస్ ఉండగా, కనిష్టం 24 డిగ్రీలు వరకు ఉండేది. అది కాస్తా ఇప్పుడు గరిష్టం 27 డిగ్రీల నుంచి 29 డిగ్రీల వరకు, కనిష్ట ఉష్ణోగ్రతలు 19 డిగ్రీల నుంచి 21 డిగ్రీల వరకు తగ్గాయి. రాయచోటి, మదనపల్లె, ప్రొద్దుటూరు, పులివెందుల, రాజంపేట, కడప, బద్వేలు తదితర ప్రాంతాల్లో గరిష్టం 29, కనిష్టం 21 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఉదయం 8గంటల వరకు బయటికి రావడానికి జనం వెనుకంజ వేస్తున్నారు.

రగ్గులు, స్వెట్టర్లకు గిరాకీ

- చలి తీవ్రత తారస్థాయికి చేరడంతో రగ్గులు, స్వెట్టర్లు , మంకీ క్యాప్‌లు గిరాకీ పెరిగింది. రాయచోటి, రాజంపేట, కడప తదితర పట్టణాల్లో మధ్యప్రదేశ్ వాసులు రోడ్ల వెంబడి తాత్కాలిక దుకాణాలు ఏర్పాటుచేసుకొని విక్రయాలు సాగిస్తున్నారు.
- నవంబరు,డిసెంబరు, జనవరి మాసాల్లో వీరి బిజినెస్ బాగానే జరుగుతుంది. ఫిబ్రవరి నెలలో మళ్లీ తమ సొంత రాష్ట్రానికి వెళ్లిపోతామని వ్యాపారులు అంటున్నారు.

రోగాల ప్రమాదం..

చలికాలం తనతోపాటు అనేక రోగాలను కూడా వెంట తీసుకొస్తుంది. ఇప్పటికే దగ్గు, జలుబు, సీజనల్ జ్వరాలబారిన పడుతున్నారు. ఇప్పుడున్న వాతవరణం వల్ల మరింత మంది ఈ జబ్బులబారిన పడే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. పౌష్టికాహారం, వ్యాయామం ద్వారా రోగనిరోధశక్తిని పెంచుకోవాలన్నారు. అధికంగా నీళ్లు తాగడం వల్ల శరీరంలో పేరుకుపోయే టాక్సిన్స్‌ను చాలవరకు బయటికి పంపవచ్చు. ఈ సీజన్‌లో కాళ్లకు పగుళ్లు రావడం, దురదలు, చర్మం పొడిబారటం వంటి ఇబ్బందులు కలుగుతాయి.

వైద్యుల సలహాలు పాటించాలి



ప్రజలు చలికి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. బయటకు వెళ్లాల్సి వస్తే రగ్గులు, మాస్కులు, ధరించాలి. గోరువెచ్చని నీళ్లు తాగడం, సాధ్యమైనంత వరకు వేడి ఆహార పదార్థాలు తినాలి. ముఖ్యంగా చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. వీరిని వీలైనంతవరకు మంచుకు, చలికి బయటికి తీసుకెళ్లరాదు. ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.రోగనిరోధకశక్తిని పెంపొదించుకోవాలి.వైద్యుల సలహాలు పాటించాలి.

– అవ్వారు అర్జున్‌కుమార్, రిమ్స్ వైద్యుడు, కడప

వాకర్స్ జాగ్రత్తలు తీసుకోవాలి



తెల్లవారుజామున వాకింగ్ చేసే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. చలి ఓవైపు, మంచు మరోవైపు పంజా విసురుతోంది. ముక్కులు, చెవులకు చల్లగాలి తగలకుండా మంకీ క్యాప్‌లు, స్వెట్టర్లు తప్పనిసరిగా ఉపయోగించాలి. వాకింగ్ డ్రస్ పూర్తిగా మెయింటిన్ చేయాలి.

– కె.శరత్‌కుమార్‌రాజు, వైస్‌ప్రెసిడెంట్, వాకర్స్ ఇంటర్నేషనల్

వ్యాపారం బాగా జరుగుతోంది



మధ్యప్రదేశ్ నుంచి వచ్చాం . అక్కడి నుంచే స్వెట్టర్లు, రగ్గులు, మంకీక్యాప్‌లు తీసుకొచ్చాం. మూడునెలల పాటు ఇక్కడ విక్రయాలు సాగిస్తాం. చలి సీజనల్‌లో ప్రతి ఏడాది వస్తుంటాం. వైఎస్సార్, కడప, అనంతపురం జిల్లాల్లో వ్యాపారం కొనసాగిస్తాం. మధ్యతరగతి, పేదలకు అందుబాటులో ధరలు ఉంటాయి. వ్యాపారం బాగా జరుగుతోంది.

–ఇర్ఫాన్ పఠాన్, వ్యాపారి, మధ్యప్రదేశ్

పంటలకు నీటితడులు



పల్లపాడులో స్ప్రింక్లర్ల ద్వారా పంటకు నీటితడులను అందిస్తున్న రైతులు



రాజుపాళెంలో కొర్ర పంటకు..



బీడు పొలాలకు..

ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులు సాగు చేసిన పంటలకు ప్రస్తుతం ఎండుముఖం పట్టడంతో రైతులు నీటితడులు అందిస్తున్నారు. కేసీ ఆయకట్టు, కుందూనది, మైలవరం నీరు, బోర్ల కింద స్ప్రింక్లర్లు, ట్రాక్టర్ పైపులు, ఆయిల్ ఇంజన్‌ల ద్వారా పత్తి, శనగ, కొర్ర, నూగు, బీడు పొలాలకు నీటితడులను అందిస్తున్నారు.

–రాజుపాళెం

కొత్త సంవత్సరం కోటి ఆశలతో..



చాపాడు మండలం ఖాదర్‌పల్లె సమీపంలో వరి సాగు కోసం సిద్ధమవుతున్న నారు

చాపాడు: గతేడాది వర్షభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఖరీఫ్ సీజన్‌లో కుందూనది, బోరుబావుల కింద రైతు వరి సాగు చేసుకున్నారు. ప్రతి రైతుకు మంచి దిగుబడులు రావటంతో పాటు రైతు ఊహించినదాని కంటే అధికరంగా వరి ధాన్యం ధరలు ఉన్నాయి. దీంతో వరి రైతుకు గతేడాది మంచి జరిగింది.దీంతో ఈ ఏడాది రబీలో సైతం వరి సాగు చేసుకునేందుకు సమాయాత్తమవుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల వరి నాట్లు వేస్తుండగా.. మిగిలిన చోట్ల వరి సాగు చేసేందుకు సంసిద్ధం అవుతున్నారు. ఎకరాకు 32-40 బస్తాల చొప్పున వరి ధాన్యం దిగుబడులు రాగా పుట్టి(8బస్తాలు) వరి ధాన్యం రకాన్ని బట్టి రూ.17 వేల నుంచి రూ.20వేల వరకు ధరలతో దళారులే నేరుగా రైతుల వద్ద నుంచి ధాన్య కొనుగోలు చేస్తున్నారు. వరి ధాన్యం గిట్టుబాటు ధరలు ఇలా ఉంటే తమకు వ్యవసాయంలో మంచి జరుగుతుందని రైతులు కోరుకుంటున్నారు.

ఆస్వాదిద్దాం...ఆనందం పంచుదాం

అంకితభావంతో కష్టపడితే విజయాలు మన సొంతం

మదనపల్లె సిటీ: కొత్త సంవత్సరం అంటేనే మరో ఆశ...నూతనోత్సాహం, కొంగొత్త ఆశలతో మరో ఏడాదికి అడుగులేసే వేడుక, గడిచిన సంవత్సరం ఇచ్చిన అనుభవాలతో, భవిష్యత్ ప్రణాళికలతో ముందుకు సాగే ఆనంద కేళి.. జీవితంలో సంతోషం, బాధ, సంతృప్తి, ఆత్మవిశ్వాసం అన్నీ సమపాళ్లలో ఉంటేనే సంపూర్ణమవుతుంది. ఈ సందర్భంగా 2023లో ఇచ్చిన అనుభవాలతో పాటు రాబోయే కొత్త ఏడాదిలో ఆశిస్తున్న మార్పులు, ఆలోచనలను 'సాక్షి'తో పంచుకున్నారు.

సరైన నిర్ణయాలతో మంచి భవిష్యత్తు



ఎప్పుడైనా సరే.. కొత్త సంవత్సరం అందించే ప్రోత్సాహం విభిన్నంగా ఉంటుంది. జీవితంలో ఆటుపోట్లు అతి సహజం. గత అనుభవాలను బట్టి మరింత జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలి. పట్టుదలతో ముందుకు సాగితే విజయం తథ్యం. గ్రూప్–1లో మొదటి ప్రయత్నంలో రాకపోయినా రెండో ప్రయత్నంలో ర్యాంకు సాధించాను. డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యాను. కష్టపడితే దేనినైన సాధించవచ్చు.

–షేక్ ఆయిషా, గ్రూప్–1 విజేత, మదనపల్లె

సాహిత్య సంవత్సరం అవ్వాలి



ప్రకృతి, సమాజం సుభిక్షంగా ఉన్నప్పుడే సంతోషమైనా, ఆనందమైనా సామాన్యుడు సైతం సగౌరవంగా బతికినప్పుడే ఏ సంబరమైనా, ఈ కొత్త ఏడాది అందరికి అనువైన అవకాశాలు అందించాలి. రాష్ట్ర ఉర్దూ అకాడమీ సంవత్సరానికి 2023 సంవత్సరానికి అత్యుత్తమ అబ్దుల్‌హఖ్ అవార్డు వచ్చింది. సాహిత్యం ప్రజల గొంతుకగా కొనసాగినప్పుడు సామాన్య ప్రజల కోసం మాట్లాడినప్పుడు ఫలితాలు ఉన్నతంగా ఉంటాయి. అధికార యంత్రాంగం సాహిత్యం సూచించే మార్పులను ఆహ్వానించగలగాలి.

–బాబా ఫక్రుద్దీన్ (ఖమర్‌అమీని), ఉర్దూ రచయిత, మదనపల్లె

7న బాలకృష్ణమ్మ సంస్మరణ

కడప ఎడ్యుకేషన్ : కడపలోని ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో జనవరి 7వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటలకు మార్పు బాలకృష్ణమ్మ సంస్మరణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ అమరావతి జిల్లా నాయకులు సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యమం మార్పు- బాలకృష్ణమ్మ పాత్రపై చర్చించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటసుబ్బయ్య హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులంతా హాజరు కావాలని కోరారు.

తెలుగు సంప్రదాయాల్లో ముగ్గులకు ప్రత్యేక స్థానం



ముగ్గుల పోటీల విజేతలతో రెడ్డి సేవా సమితి ప్రతినిధులు

కడప కల్చరల్ : తెలుగింటి సంప్రదాయాల్లో ముగ్గులకు ముఖ్యపాత్ర ఉందని, మహిళల కళాత్మక హృదయాన్ని ఆవిష్కరించుకునే ఈ అవకాశాన్ని కడప రెడ్డి సేవా సమితి ఇవ్వడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం స్థానిక రాజీవ్‌మార్గ్‌లోని శివశివాని హైస్కూలులో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన సంస్థ అధ్యక్షుడు కె.నాగిరెడ్డి, కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కోశాధికారి జి.ఆదినారాయణరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పద్మప్రియ చంద్రారెడ్డి, ప్రతినిధి మధుసూదన్‌రెడ్డి, జి.వెంకటరెడ్డి, అశోక్‌రెడ్డి, రెడ్డి జనసంఘ అధ్యక్షులు సుబ్బారెడ్డి కార్యక్రమ వివరాలను తెలిపారు. అనంతరం జరిగిన ముగ్గుల పోటీలో జిల్లా వ్యాప్తంగా 68 మంది మహిళలు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ప్రొఫెసర్లు పుత్తా పద్మ, ఆచార్య రమాదేవి, ముడియం హేమలతలు నియమ నిబంధనలను వివరించారు.

విజేతలు

ముగ్గుల పోటీలో కడప అక్కాయపల్లెకు చెందిన ఎం.సుభాషిణి, దేవునికడపకు చెందిన జి.విజయశాంతి, చాపాడు నాగాయపల్లెకు చెందిన వి.ఉమామహేశ్వరి మొదటి మూడు బహుమతులు సాధించారు. తర్వాతి స్థానాల్లో నిలిచిన వరలక్ష్మి, అరుణాదేవి, లక్ష్మీదేవి, సుభాషిణి, విజయలక్ష్మిలు ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ నాగేంద్రారెడ్డి విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

7న బండలాగుడు పోటీ: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 7న కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో బండలాగుడు పోటీ నిర్వహించనున్నట్లు రెడ్డి సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. జనవరి 13న ఉదయం 10 గంటలకు రాజీవ్‌మార్గ్‌లోగల వేమన సర్కిల్ ప్రాంతంలో విశ్వకవి వేమన విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 3 గంటలకు ఈ పోటీల విజేతలకు బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు.

నివాళి: అపర దానకర్ణుడు బుద్ధా వెంగళరెడ్డి 123 వర్ధంతిని పురస్కరించుకుని నిర్వాహకులు ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. మహాదాతగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. సంస్థ ప్రతినిధులు రెడ్డి కుమారి, మద్దిక సుబ్బారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారి, నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఏపీటీఎఫ్–1938కు సంబంధించిన నూతన క్యాలెండర్‌ను శనివారం సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఏపీటీఎఫ్ నాయకులతో కలిసి కడపలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, రాష్ట్ర కౌన్సిలర్ రాళ్లపల్లి అబ్దుల్లా, అసోసియేట్ అధ్యక్షుడు బత్తల రాజు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగభూషణం, ఈశ్వరరెడ్డి, రమేష్‌బాబు, కాశీంపల్లి, శివ రామకృష్ణారెడ్డి, నాగరాజు తదితరుల పాల్గొన్నారు.

చిత్రం.. భళారే సుందరం



కడప నగరంలోని గోడలపై చిత్రాలను గీస్తున్న వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులు


- 'క్లీన్ కడప'లో వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ విద్యార్థుల భాగస్వామ్యం
- ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా బొమ్మలు



ఏఎఫ్‌యూ : కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'క్లీన్ కడప' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నగర సుందరీకరణ పనుల్లో డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం విద్యార్థులు భాగస్వాములయ్యారు. విశ్వవిద్యాలయంలో చదువుతున్న ఫైన్‌ఆర్ట్స్ విభాగం (పెయింటింగ్, స్కల్ప్చర్) విద్యార్థులు నగరంలోని ప్రధాన రహదారుల వెంట ఆకర్షణీయమైన పెయింటింగ్స్ వేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. కడప నగరపాలక సంస్థ కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆదేశాల మేరకు నగర పాలక అధికారులు.. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డిలతో కలిసి విద్యార్థుల కళను వినియోగించుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో తాము నేర్చుకుంటున్న కళలను ప్రదర్శించేందుకు చక్కటి వేదిక దొరికినట్లు భావించి విద్యార్థులు తమలోని సృజనాత్మకతను ప్రదర్శిస్తూ చక్కటి చిత్రాలను గీస్తున్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే సామాజిక అంశాలు, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజెప్పేలా తీర్చిదిద్దుతున్న విద్యార్థుల సేవలను ప్రజలు కొనియాడుతున్నారు. గోడలపైకి రంగులు వచ్చి చేరడంతో సరికొత్త కడపగా గోచరిస్తోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా ప్రస్తుతానికి కడప నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి ఆర్‌టీసీ బస్టాండు వరకు చిత్రాలు గీస్తున్నామని, దాదాపు 500 చిత్రాలను గీయనున్నట్లు వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ పెయింటింగ్ విభాగం కోఆర్డినేటర్ మనోహర్‌రావు తెలిపారు.

చలో హార్సిలీహిల్స్

- నూతన వేడుకలకు 10 వేల మందికిపైగా రాక
- 26 ప్రత్యేక బస్సులు ఏర్పాటు



పాత వ్యూపాయింట్ వద్ద ప్రమాదక బండపై యువకుల అత్యుత్సాహం (ఫైల్)

బి.కొత్తకోట: సాధారణ ప్రజల నూతన వేడుకలకు వేదిక బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్. పేదవాడి ఊటీగా పేరుగాంచిన కొండపై ప్రతిఏటా వేల సంఖ్యలో సందర్శకులు వస్తారు. దీనికి తగ్గట్టు ఏర్పాట్లు లేకున్నా సందర్శనకు మొగ్గ చూపుతారు. వేడుకలు జరుపుకునేందుకు సోమవారం కొండకు 10వేల మందికిపైగా తరలివస్తారని అంచనా. భద్రత చర్యలు, మద్యం తరలింపును అడ్డుకునేందుకు కొండకింద ప్రవేశం వద్ద ఆదివారం చెక్‌పోస్టును ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోల రాకను నిషేధించారు. పొరుగు రాష్ట్రాల మద్యం తెస్తే కేసులు నమోదు చేయనున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, అల్లరి చేసిన కేసులు పెట్టేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారు. సాహస విన్యాసాలు చేస్తూ ప్రమాదాలకు గురికాకుండా సందర్శకులు జాగ్రత్తలు పాటించాల్సివుంది. లేదంటే కోరి ప్రాణాలమీదకు తెచ్చుకున్నట్టే.

వేలసంఖ్యలో రాక

కొండపై వేడుకలు నిర్వహించుకునే సందర్శకుల సంఖ్య వేలల్లో ఉంటుంది. పొరుగు రాష్ట్రాలకు చెందిన సందర్శకులు ఆదివారం రాత్రికే కొండకు చేరుకొని సంబరాలు చేసుకొంటారు. కేక కట్‌చేసి రోడ్లపై సందడి చేస్తారు. వైఎస్‌ఆర్‌కడప, అనంతపురం, శ్రీసత్యసాయి పుట్టపర్తి, అన్నమయ్య, చిత్తూరుజిల్లాలు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన సందర్శకులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. వీరంతా ప్రకృతి అందాల నడుమ వేడకలతో సంబరాలు చేసుకొంటారు. కుటుంబాలతో వచ్చే సందర్శకులు అధికంగానే ఉంటారు. కాగా ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో కొండకు వచ్చే సందర్శకులను కొండపైకి అనుమతించరు. ఆటోలు, ద్విచక్ర వాహనాలతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున నిషేధించారు.

26 ప్రత్యేక బస్సులు: వివిధ ప్రాంతాలను హార్సిలీహిల్స్‌కు 26 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్టు మదనపల్లె డీఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రయాణీకుల నుంచి సాధారణ చార్జీలనే వసూలు చేస్తామని తెలిపారు. మదనపల్లె-హార్సిలీహిల్స్ మధ్య 10, అంగళ్లు-హార్సిలీహిల్స్ మధ్య 4, బి.కొత్తకోట-హార్సిలీహిల్స్ మధ్య 4, కాండ్లమడుగు-హార్సిలీహిల్స్ మధ్య 8 బస్సులు నడుస్తాయని తెలిపారు. బందోబస్తు కోసం నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు, 50 మంది పోలీసులు విధుల్లో ఉంటారని డీఎస్పీ కేశప్ప చెప్పారు.

శృతి మించితే విషాదమే..

కొండపై జరుపునే సంబరాల్లో అపశృతులు దొర్లుతున్నాయి. ప్రమాదకర పరిస్థితులను పర్యాటకులు గుర్తించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అత్యుత్సాహంతో ప్రమాదకర విన్యాసాలకు పాల్పడటం ప్రాణాల మీదకు తెస్తోంది. గతంలో పీటీఎం మండలం టీ.సదుం గ్రామానికి చెందిన కోమలేష్ జమునా బిల్డింగ్ వెనుకున్న ప్రమాదకరమైన బండరాయిపై నుంచి జారి పడటంతో లోయలో పడ్డాడు. ఈ కింది ప్రాంతాల్లో పోలీసు భద్రత కల్పించకుంటే ఇబ్బందికరం.

- గాలిబండ కిందకు వెళ్తుంటారు. అలా దిగడంపై జాగ్రత్తగా ఉండాలి. కొందరు సాహసం చేస్తూ చాలాకిందకు వెళ్తుంటారు. అదుపుతప్పితే వెతకడం అసాధ్యం.
- పాత వ్యూపాయింట్ ఎదురుగా ఉన్న బండపైకి ఎక్కుతుంటారు. ఇది అత్యంత ప్రమాదకమైన ప్రాంతం. ఈ బండపైకి ఎక్కినవారిని చూస్తేనే అందోళన వ్యక్తం అవుతుంది. అలాంటిది యువకులు సాహసం చేస్తున్నమన్న భావనతో ప్రమాదాల అంచుకు వెళ్తున్నారు.
- కొత్త వ్యూపాయింట్ కింద నిలబడి ముందుకు వెళ్లడం ప్రమాదం. ఇది నిటారుగా..లోతుగా కనిపిస్తుంది. పట్టు తప్పితే జారితే ఇక అంతే.
- జమునా బిల్డింగ్ వెనుకవైపు లోయలాంటి బండరాయిపై సంచారం ప్రమాదకరం. ఇక్కడ ఇప్పటికే రెండు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు జారిపడి అదృష్టవశాత్తు ప్రాణాపాయం తప్పింది.

నిరుపయోగంగా సబ్సిడీ వ్యవసాయ పరికరాలు



వెలుగు కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న ఒంటిమడక యంత్రాలు, తేనేతయారీ యంత్రాలు

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లా గుర్రంకొండలోని వెలుగు కార్యాలయంలో సబ్సిడీ వ్యవసాయ పరికరాలు మూలనపడ్డాయి. గిరిజనులు తేనే తయారీ కోసం వినియోగించే యంత్రాలు కార్యాలయంలో తుప్పు పడుతున్నాయి. రైతులకు 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేయడానికి వ్యవసాయ యంత్రాలు నాలుగేళ్ల క్రితం స్థానిక వెలుగు కార్యాలయానికి వచ్చాయి. మొత్తం 13 ట్రాక్టర్‌తో దున్నే ఒంటిమడకలు మంజూరయ్యాయి. ఒక్కో మడక విలువ రూ.14.666 కాగా అందులో 50 శాతం సబ్సిడీ ఉంటుంది. నిబంధనల మేరకు సబ్సిడీ పోను ఒక్కో రైతు రూ. 8330 చెల్లించాలి. వెలుగు గ్రామసమాఖ్యల ద్వారా వీటిని అవసరమైన రైతులకు పంపిణీ చేసేందకు అధికారులకు అప్పట్లో ఆదేశాలు వచ్చాయి. అయితే కిందిస్థాయి సిబ్బంది వీటిని రైతులకు విక్రయించడంలో శ్రద్ధ చూపించడం లేదనే విమర్శలున్నాయి. దీంతో ఇవి వెలుగు కార్యాలయంలో ఓ మూలన పడిఉన్నాయి. వీటితో పాటు గిరిజనలకు ఉపాధి కల్పించడం కోసం తేనే తయారి చేసే యంత్రాలు అప్పట్లో మంజురయ్యాయి. 75 శాతం సబ్సిడీతో వీటిని పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఏళ్లు గడుస్తున్నా అధికారులు వీటి గురించి పట్టించుకోవడం లేదు. దీంతో వెలుగు కార్యాలయంలో ఓ మూలన వీటిని పడేశారు. వీటిని ఇలాగే వదిలేస్తే తుప్పు పట్టె అవకాశముంది. అధికారులు స్పందించి వెంటనే తగు చర్యలు చేపట్టాల్సి ఉంది.